# 38

# గొప్ప విశ్వాసము మరియు అల్ప విశ్వాసము

## (15:21-39)

ఇప్పుడీ సన్నివేశము యేసు గలిలయలో పరిసయ్యులతో ఘర్షణ పడుట నుండి ఆయన ఫెనీకేలో ఒక అన్యురాలిని ఎదుర్కొను దిశగా మారుచున్నది. శిష్టాచార వాడుకగా మురికి చేతులను కడుగుకొనుటకు సంబంధించిన యూదుల పారంపర్యాచారములను ఎదుర్కొనిన తరువాత, అపవిత్రులైన వారి గూర్చి వారిలో నిషేధింపబడి యుండిన అభ్యాసములను యేసు ఎదుర్కొన వలసివచ్చినది. అన్యజనులే అపవిత్రులైనవారుగా పరిగణింపబడుట కాదు, కానీ వారు నివసించుచున్న ప్రదేశములు సహితము అపవిత్రమైనవిగా ఎంచబడినవి.

యేసు అన్యురాలైన స్త్రీని ఎదుర్కొనిన విషయము పవిత్రత గూర్చి చర్చింపబడిన వెనువెంటనే రచింపబడుట, ఎట్టకేలకు అన్యజనులు ఇకమీదట ఇశ్రాయేలీయులలో నుండి వేరుచేయబడరని సూచింపవచ్చును (అపొస్తలుల కార్యములు 10:15, 28; 11:9-18 చూడు).[1] ఈ వివరణ అన్యజనులలో కొందరు కలిగియుండిన గొప్ప విశ్వాసమునకును దేవుడేర్పరచుకొనిన జనులు, యేసును వెంబడించుచుండిన వారితో సహా, కలిగియుండిన అల్పవిశ్వాసమునకును మధ్య నున్న ఒక హాస్యాస్పదమైన తారతమ్యమును చెడగొట్టుచున్నది.

ఆయన సానుభూతిలేనివాడుగాను, శ్రద్ధచూపనివాడుగాను, మరియు తన సొంతవారి మీద మాత్రమే అభిమానం చూపుతూ ఆయన యొద్దకు వచ్చిన అన్యురాలైన స్త్రీని ద్వేషించువాడై యున్నాడంటూ విమర్శకులు ప్రభువును నిందించారు. ఎంతైనా, యేసు మనోవ్యధ చెందుచుండినవారి యెడలను, ఆకలిగొనుచుండిన జనసమూహముల యెడలను కనికరముగలవాడై యుండినాడని సువార్తలలో తరుచుగా చిత్రీకరింపబడియున్నాడు. ఏదిఏమైనా, ఆయన కొంత మేరకు నిర్దయుడుగా ప్రవర్తించుచుండెనని అగుపించినపుడెల్లా, ఆయన చెప్పిన దానికి గాని, చేసిన దానికి గాని ఏదో ఒక కారణసహితమైన హేతువుండినదని తప్పక గుర్తింపబడవలెను (8:22; 10:9, 10 చూడు). "అన్యురాలై యుండిన ఈ స్త్రీ యెడల మన ప్రభువు ప్రతిస్పందించిన తీరు, ఆమె యొక్క విశ్వాసమును బలహీనపర్చుటకు కాదు, కానీ బలపర్చుటకే ఉద్దేశింపబడినదై యున్నదని" వారెన్ డబ్ల్యు. వియర్స్బి రచించాడు.[2]

### కనాను స్త్రీ విశ్వాసము (15:21-28)

**21యేసు అక్కడనుండి బయలుదేరి తూరు సీదోనుల ప్రాంతములకు వెళ్లగా, ఇదిగో**
**ఆ ప్రాంతములనుండి కనాను స్త్రీ యొకతె వచ్చి-ప్రభువా, దావీదు కుమారుడా, నన్ను**
**కరుణింపుము; 22నా కుమార్తె దయ్యముపట్టి, బహు బాధపడుచున్నదని కేకలువేసెను.**
**23అందుకాయన ఆమెతో ఒక్క మాటయైనను చెప్పలేదు. అప్పుడాయన శిష్యులు వచ్చి-**

**ఈమె మన వెంబడి వచ్చి కేకలువేయుచున్నది గనుక ఈమెను పంపివేయుమని ఆయనను**
**వేడు కొనగా 24ఆయన–ఇశ్రాయేలు ఇంటివారై నశించిన గొఱ్ఱెలయొద్దకే గాని మరి**
**ఎవరియొద్దకును నేను పంపబడ లేదనెను 25అయినను ఆమె వచ్చి ఆయనకు మ్రొక్కి–**
**ప్రభువా, నాకు సహాయము చేయుమని అడిగెను. 26అందుకాయన–పిల్లలరొట్టె తీసికొని**
**కుక్క పిల్లలకువేయుట యుక్తము కాదని చెప్పగా 27ఆమె నిజమే ప్రభువా, కుక్కపిల్లలుకూడ**
**తమ యజమానుల బల్లమీదనుండి పడు ముక్కలు తినును గదా అని చెప్పెను. 28అందుకు**
**యేసు అమ్మా, నీ విశ్వాసము గొప్పది; నీవు కోరినట్టే నీకు అవునుగాక అని ఆమెతో**
**చెప్పెను. ఆ గడియలోనే ఆమె కుమార్తె స్వస్థత నొందెను.**

**వచనము 21** భావించుకొనబడుచున్నట్లుగా, **యేసు** గేన్నసరెతు ప్రాంతమును విడచి (14:34) **తూరు సీదోనుల ప్రాంతములకు వెళ్లెను.** "వెళ్లెను" అని అర్థమిచ్చుచున్న ఇచ్చటి గ్రీకు పదము (*anachōreō*) "ఆశ్రయించెను" అను అర్థమును కూడ ఇచ్చుచున్నది. ఆయన కొంత సేపటి వరకు గలిలయను ఉద్దేశపూర్వకంగానే విడచి వెళ్లియుండును, ఇంతలో అచ్చటి వైరభావములు సద్దుమణుగునని ఆశించియుండును (12:15; 14:13పై గల వ్యాఖ్యానము చూడు). తూరు మరియు సీదోను ప్రాంతములు, మధ్యధరా సముద్రము ప్రాచ్య తీరమున ఉండి ఒకప్పుడు ప్రాచీన ఫేనీకే రాజ్యమని పిలువబడిన దేశములోని అన్యజనుల పట్టణములై యుండినవి. ఫేనీకేయుల నీచపు మతమునకు పేరుగాంచినవారై యుండిరి, గనుక వారు దేవుని ప్రవక్తల చేత ఖండింపబడుచుండిరి (11:21పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 22.** యేసు ఒక ఇంటిలోనికి ప్రవేశించిన తరువాత (మార్కు 7:24), **ఆ ప్రాంతము నుండి కనాను స్త్రీ యొకతె** ఆయన యొద్దకు వచ్చినది. రోమీయులై యుండిన తన పాఠకుల నిమిత్తము మార్కు ఆమెను "సురోఫెనికయు స్త్రీ" అని వర్ణించుచున్నాడు (మార్కు 7:26), అయితే యూదులై యుండిన తన పాఠకుల నిమిత్తము మత్తయి ఇదివరకటి పాత పదమునే, "కనాను స్త్రీ" అని ప్రయోగించుచున్నాడు. కనానీయులు సీదోనును వ్యవస్థాపించుకొన్నారు (ఆదికాండము 10:15, 19), మరియు ఫేనీకేయులు వారి వంశస్థులయ్యారు. ఈ స్త్రీ యూదులు చేత తృణీకరింపబడుచుండిన వారిలో ఒకతియై యుండినది–ద్వితీయోపదేశకాండమ 7:1, 2లో వీరిని నిర్మూలముచేయవలనని యెహోషువాకు దేవుడు ఆజ్ఞాపించెను. "కనానీయుడు/ఫెనికేయురాలు" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*Chananaios*) ఒక ఫేనీకీయురాలిని/ఫేనీకేయుని సూచించుటకు మొదటి శతాబ్దములో యూదుల చేత ప్రత్యేకంగా ప్రయోగింపబడినదని సూచింపబడుచున్నది.[3]

ఈ స్త్రీ, బహుశా విగ్రహారాధికురాలై యుండవచ్చును, యేసు యెదుటకు, ఒక యూదుల ఉపదేశకుడు మరియు స్వస్థపరచువాని యెదుటకు, ఎంతో వినయముతో వచ్చినది. ఆమెకు యేసు సహాయము ఎంతో ఆవశ్యకమై యుండినది ఏలయనగా **ఆమె కుమార్తె దయ్యముపట్టి బహు బాధపడుచుండినది**. ఆ స్త్రీ యేసు యెదుట బిగ్గరగా కేకవేసినది, కానీ మర్యాదపూర్వకంగా మాటలాడినది, ఆయనను **ప్రభువా** అని సంబోధించుచు, **దావీదు కుమారుడా** అను మెస్సీయ సంబంధిత హోదాను ప్రయోగించినది (1:1; 9:27; 12:23; 20:30, 31; 21:9, 15; 22:42 చూడు). ఆమె

యొక్క అన్యమతారాధికుల నేపథ్యమునుబట్టి చూస్తే, ఆమె పలికిన మాటలు ఆశ్చర్యమును కలుగజేయుచున్నవి. ఏది ఏమైనా, సువిస్తారమైన యేసు యొక్క ప్రజాదరణను, మరియు మెస్సీయ గూర్చి యూదులకుండిన నిరీక్షణ గూర్చి-ముఖ్యముగా సిరియా ప్రాంతములో-అన్యజనులు సుపరిచితులై యుండిరని ఈ మాటలు సామాన్యముగా తెలియజెప్పును (4:24, 25 చూడు).

**వచనము 23**. మొదట, యేసు ఆ స్త్రీని అలక్ష్యము చేయుచున్నట్లు అగుపించుచున్నది: **ఆయన ఆమెతో ఒక్క మాటయైనను చెప్పలేదు.** అట్లయినప్పటికిని, ఆయన ఏమియు మాటలాడక మౌనముగా నుండుటనుబట్టి ఈ తల్లి నిరాశచెందలేదు, నిరుత్సాహపడలేదు. ఆయన మాత్రమే సమకూర్చగలడని ఆమె ఎరిగియుండినది ఏదో ఆమెకు అవశ్యకమై యుండినది.

ఆమెను **పంపివేయవలెనని శిష్యులు** యేసును అడిగారు, కానీ ఆమె ఏ మాత్రము నిరుత్సాహపడలేదు. ఆమె మొదట అలక్ష్యము చేయబడినది, ఆ తరువాత నిరాకరింపబడినది. ఆమెను పంపివేయుటకు యేసు శిష్యులు ప్రయత్నించిన తరువాత కూడ, ఆమె ప్రభువును వేడుకొనుట మానలేదని ఆమె పలికిన మాటలు మనకు తెలియజెప్పుచున్నవి.

**వచనము 24**. చివరకు యేసు, **ఇశ్రాయేలు ఇంటివారై నశించిన గొఱ్ఱెల యొద్దకే గాని మరి ఎవరియొద్దకును నేను పంపబడలేదని** పలికాడు. 23వ వచనంలో యేసు ప్రదర్శించిన మౌనం, మరియు 24వ వచనంలో ఆయన పలికిన పలుకులు, ఈ రెండూ కూడ ఆమె విశ్వాసమును బలపర్చుటకే ఉద్దేశింపబడినవై యున్నవి (యోహాను 2:3, 4; 6:5, 6 చూడు).

యేసు అన్యజనుల ప్రాంతమైన తూరు మరియు సీదోనుకు వెళ్లిపోయినప్పటికిని, ఆయన బృహత్కార్యభారము యింకను దేవుని ప్రజలపైనే, ఇశ్రాయేలీయులపైనే, కేంద్రీకృతమై యుండినది. యూదుల యెడల యేసు కలిగియుండిన అంకితభావం, దేవుడు వారిని ఎన్నుకొని వారికిచ్చిన ఆయన వాగ్దానములను నెరవేర్చుటలో ఆయన కలుగజేసుకొనుటను బయలుపర్చుచున్నది.[4] మత్తయి వ్రాసిన సువార్తలో ఇంతకు మునుపు, వారు "కాపరిలేని గొఱ్ఱెల వలె విసికి చెదరియున్నారని" యేసు ఇశ్రాయేలు ప్రజలపై కనికరపడ్డాడు (9:36), వారికి పరిమితమైన అధికారముతో కూడిన బాధ్యతను అప్పగించి ఆయన తన "ఇశ్రాయేలు ఇంటివారై నశించిన గొఱ్ఱెల యొద్దకే వెళ్లవలెననియు" ఆయన వారికి సెలవిచ్చాడు (10:5, 6). యేసు ప్రత్యేకముగా ఇశ్రాయేలు ప్రజల నిమిత్తమే పంపబడినాడనునది వాస్తవమైనప్పటికిని, ఆయన అప్పుడప్పుడు అన్యజనులకును సమరయులకు పరిచర్య చేసాడు (8:5–13; యోహాను 4:1–42). దేవుడు ఇశ్రాయేలు ప్రజల యెడల కలిగియుండిన విశ్వసనీయత యేసు చేసిన పరిచర్య ద్వారా వెల్లడి చేయబడియుండగా, అది అన్యజనుల ఆశీర్వాదమునకు సహితము హేతువగును (రోమీయులకు 15:8–12).

**వచనము 25.** యేసు అలా మాట్లాడినప్పటికి, **ఆమె వచ్చి ఆయనకు మ్రొక్కి, ప్రభువా, నాకు సహాయము చేయుమని అడిగెను.** "మ్రొక్కి" అని అర్థమిచ్చుచున్న పదము (*proskuneō*) వినయపూర్వకమైన చర్యను సూచించుచున్నది, గనుక, దాదాపుగా ఇటువంటి అన్ని సందర్భములలోను, ఆరాధించుట యను ధ్వనింపునిచ్చుచున్నది. మానవ మరియు దైవికమైన యజమానులను సంబోధించుటకు "ప్రభువా" అను పదము (*kurios*) ప్రయోగింపబడినది. ఈ పదము నిర్దిష్టమైన ఒక సందర్భములో నిక్కచ్చిగా ఏమని

అర్థమిచ్చునో నిర్ధరించుట ఎల్లప్పుడు సులభము కాదు. అట్లయినప్పటికిని, సహాయము చేయుటకు ఆయనకు శక్తి కలదని తెలిసికొనినదై, వినయపూర్వకముగాను, ఆరాధనా భావముతోను యేసు యెదుటకు వచ్చినదని స్పష్టమగుచున్నది.

ఈ స్త్రీ యొక్క పట్టుదల నిజముగా ఆశ్చర్యజనకమై యున్నది. ప్రభువు నుండి ఆమె ఆశించుచుండిన దీవెనను కోల్పోవుటకు ఎట్టిపరిస్థితిలోనూ ఆమె అంగీకరించదు. యేసు యొద్ద నుండి వెనుకకు వెళ్లిపోయినట్లయితే, ఆమె ఆశ తీర్చుబడుటకు ప్రత్యామ్నాయ మార్గము లేదని ఆమె అర్థంచేసుకొన్నది (యోహాను 6:66–69 చూడు).

**వచనము 26.** ఆమె విశ్వాసమును పరీక్షించుటను కొనసాగించుచు, **పిల్లల రొట్టె తీసికొని కుక్కపిల్లలకు వేయుట యుక్తము కాదని** యేసు పలికాడు. "రొట్టె" (*artos*) యొక్క చర్చ ఈ పదిహేనవ అధ్యాయమందంతటను అగుపించుచున్నది. పరిసయ్యులకును యేసునకును మధ్య తలెత్తిన ఘర్షణ ఆయన శిష్యులు శిష్టాచారము చొప్పున కడుగుకొనబడని చేతులతో రొట్టెను తినుటకు సంబంధించినదే. ఈ శిష్యులు అన్యజనులతో సంబంధము కలిగియుండుటనుబట్టి కూడ వారు అపవిత్రులయ్యారని ఎంచబడియుండును (15:2). ప్రస్తుత సందర్భములో, పిల్లల (యూదుల) రొట్టె కుక్కపిల్లలకు (అన్యజనులకు) (15:26) వేయబడకూడదని యేసు సెలవిచ్చుచున్నాడు. ఈ అధ్యాయం ముగింపులో, నాలుగు వేల మందికి, అన్యజనులై యుండుటకు అవకాశముగలవారికి, ఆహారము పెట్టుటకు యేసు ఆయన శిష్యులు తెచ్చిన రొట్టెను ఉపయోగించాడు (15:33, 34, 36).

26వ వచనములోని యేసు ఘోషణ ఆయన యొక్క మెస్సీయత్వమునకు సంబంధించినది కానిదిగాను, ఆ స్త్రీ యెడల అక్షేపణీయమైనదిగాను ఉన్నది. ఈ వచనమును అనువదించునప్పుడు, ఒకరు కనీసము మూడు విషయముల గూర్చి తగు జాగ్రత్త వహించవలెను. మొదటిది, యేసు ఆ స్త్రీని పరీక్షించుచుండెను, ఏలయనగా కొన్ని పర్యాయములు కొంత స్థిరత్వము అవసరమై యుండును. రెండవది, ఈ గ్రంథ పాఠము యేసు స్వర ధోరణినిగాని, ముఖవైఖరులనుగాని–సంభాషణా సరణిలో ఈ రెండును ఆవశ్యకమైన కోణములై యున్నవి–బయలుపర్చుటలేదు. "ఏదైన ఒక విషయము తెలియజెప్పబడినప్పుడు ఒకరి స్వర ధోరణి మరియు కనుదృష్టినిబట్టి దాని అర్థములో ఎంతో వ్యత్యాసము కనబడును. ఒక కష్టమైన విషయము కూడ అవతలి వ్యక్తిని శక్తిహీనుని జేయగలుగు చిరునవ్వుతో చెప్పబడవచ్చునని" విల్యమ్ బార్క్లే చెప్పుచున్నాడు.[5] మూడవది, "కుక్క" (*kunarion*) అని అర్థమిచ్చు గ్రీకు పదము "పెంపుడు కుక్క" అని అర్థమీయగలదు.[6] అది *kuōn,* వీధుల్లో తిరుగులాడే కుక్కను సూచించు పదము యొక్క అల్పార్థక పదమై యుండవచ్చును. నిజానికి, పెంపుడు కుక్కతో పోల్చబడుట, వీధి కుక్కతో పోల్చబడినంత హీనమైనదై యుండదు.

యూదులు అన్యజనులను "కుక్కలు" అని ఒక విధమైన అవహేళనాత్మకమైన ఉద్దేశంతో ప్రస్తావించారు (7:6పై గల వ్యాఖ్యనము చూడు). అన్యజనులు యూదుల ఆహార నియమమునకు కట్టుబడియుండలేదు; వారికిష్టమైన దానిని ఆరగించుచుండిరి. కాబట్టి, వారు మురికివారు, మలమును మరియు చెత్తాచెదరమును తింటూ వీధుల్లో తిరుగుచుండు ఊరికుక్కల వంటి వారై యుండిరి. ఇంకా, వారి జారత్వమునుబట్టి అన్యజనులు అదుపులో లేని కుక్కల వలె ఉండిరి. సామాన్యముగా చెప్పుకొన్నట్లయితే, అన్యజనులు దేవుని నిబంధన

జనులు కానందునుబట్టి యూదులు వారిని వారి కంటె నిమ్నమైన వారిగా ఎంచారు.

**వచనము 27.** మనస్సు నొచ్చుకొనుటకు బదులుగా, చురుకుదనముతో వెంటనే బదులివ్వలగిన ఆ స్త్రీ అట్టి సామ్యమున తన సొంత ప్రయోజనము కొరకే సద్వినియోగము చేసికొన్నది. "కుక్కలు" (*kunarion*) అని అర్థమిచ్చుచుండినది, యేసు ఉపయోగించిన పదమునే పునరుచ్చరించుచు, **నిజమే ప్రభువా, కుక్క పిల్లలు కూడ తమ యజమానుల బల్ల మీద నుండి పడు ముక్కలు తినును గదా** అని ఆమె ప్రత్యుత్తరమిచ్చినది. ఈ మాటల భావానువాదము ఇలా ఉండగలదు, "అన్యజనులమైన మేము యూదులతో కూడ వారి రొట్టెను తినుటకు బల్ల మీద కూర్చుండలేకపోవచ్చును, కానీ బల్ల క్రింద నుండు కుక్కలు సహితము ముక్కలను తినును గదా."

యేసు ఆమె కుమార్తెను స్వస్థపరచినప్పటికిని, ఆయన తన సొంత ప్రజలకు పరిచర్య చేయు నిమిత్తము కలిగియుండిన ఎంతో గొప్ప శక్తిని లేశమాత్రమైనను తగ్గించజాలదని ప్రేమామయియై యుండిన ఈ తల్లి నమ్మినది. ఆమె అంతకు క్రితం యేసును "దావీదు కుమారుడు"గా, ఇశ్రాయేలు మెస్సీయగా, గుర్తించినది (15:22). ఆయన సమస్త జనులకు సహితము ప్రభువై యున్నాడని ఆమె తెలియజెప్పుచుండినట్లు ఇచ్చట వ్రాయబడి యున్న ఆమె సమాధానము ధ్వనించినది. నిజముగా, దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానములలో ఆయన సంతానము, అనగా క్రీస్తు ద్వారా సమస్త జనాంగములకు కలుగు ఆశీర్వాదములు కలిసియుండినవి (ఆదికాండము 12:3; 22:18; 26:4; గలతీయులకు 3:6–18).

**వచనము 28**. దేవుని ప్రణాళికలో ఇశ్రాయేలీయుల కియ్యబడిన ప్రథమ స్థానాన్ని ఆ స్త్రీ అంగీకరించిన తరువాత, ఆమెకు సహాయము చేయుటకు యేసు ఇష్టపడుచుండెను. ఆమె ఇచ్చిన సమాధానము బహుశా ఆమె ఇవ్వవలెనని యేసు ఆశించినదే అయియుండినను, ప్రభువు మనస్సు ఆమె ఇచ్చిన సమాధానము వలన కరిగిపోయినది. గనుక ఆయన, **అమ్మా, నీ విశ్వాసము గొప్పది** అని పలికాడు. "అమ్మా" అను సంబోధనము అనురాగరహితమైనదై లేదా కనికరములేనిదై యుండలేదు. ఇదే పదము క్రొత్త నిబంధనలో యేసు తన సొంత తల్లితో చేసిన సంభాషణతో పాటు (యోహాను 2:4; 19:26) ఇతర స్థలములందు సహితము వాడబడినది (లూకా 13:12; 22:57; యోహాను 4:21; 8:10; 20:13, 15).

ఆ స్త్రీ పట్టుబట్టియుండినందు వలన, ఆమె ఆశించిన ఆశీర్వాదమును ఆమె పొందినది. ఆమె ప్రదర్శించిన "గొప్ప" విశ్వాసమునుబట్టి యేసు ఆమెను గొప్పగా ప్రశంసించాడు, యేసు కేవలము రెండు పర్యాయములు మాత్రమే అతడు లేక ఆమె కలిగియుండిన విశ్వాసమునుబట్టి వారిని ప్రశంసించాడు, రెండు సందర్భములలోను వారు అన్యజనులై యుండుట విశేషము. ఒకడు, అతని దాసుడు స్వస్థపరచబడిన రోమా ప్రభుత్వ శతాధిపతి (8:5–13), మరియు రెండవ వ్యక్తి ఈ కనానుకు చెందిన తల్లి,

**నీవు కోరినట్టే నీకు అవునుగాక** అని యేసు పలుకవలసి వచ్చినది. **ఆ గడియలోనే ఆమె కుమార్తె స్వస్థనొందినది.** శతాధిపతి దాసుని సందర్భములో, ఆ చిన్న దానిని స్వస్థపర్చుటకు ఆయన స్వయంగా అచ్చోట ఉండవలసిన అవసరం లేకుండినది. ఆయన ఆమె మీద చేతులుంచవలసిన అవసరం కూడ రాలేదు. యేసు, జీవమునకే ప్రభువై యున్నాడని ఎరిగిన దయ్యములు, ఆయన చెప్పినట్లు చేసినవి.

## అన్యజనుల ఆహ్వానము (15:29-39)

### యేసు జనసమూహములను స్వస్థపరచుట (15:29-31)

**[29]యేసు అక్కడనుండి వెళ్లి, గలిలయ సముద్రతీరమునకు వచ్చి, కొండెక్కి అక్కడ కూర్చుండగా [30]బహు జనసమూహములు ఆయనయొద్దకు కుంటివారు గ్రుడ్డివారు మూగవారు అంగహీనులు మొదలైన అనేకులను తీసికొనివచ్చి ఆయన పాదములయొద్ద పడవేసిరి; ఆయన వారిని స్వస్థపరచెను. [31]మూగవారు మాటలాడుటయును అంగహీనులు బాగుపడుటయును కుంటివారు నడుచుటయును గ్రుడ్డివారు చూచుటయును జనసమూహము చూచి ఆశ్చర్యపడి ఇశ్రాయేలు దేవుని మహిమపరచిరి.**

**వచనము 29. యేసు అక్కడ నుండి వెళ్లి, గలిలయ సముద్రతీరమునకు వచ్చె**నని మత్తయి మన కొరకు వ్రాయుచున్నాడు. "ఆయన మరల తూరు ప్రాంతములు విడచి, సిదోను ద్వారా దెకపొలి ప్రాంతముల మీదుగా గలిలయ సముద్రము నొద్దకు వచ్చెను" అంటూ, మార్కు ఇంకా కొంచెము నిర్దిష్టముగా వ్రాయుచున్నాడు (మార్కు 7:31). దెకపొలి, పది పట్టణముల సముఖ్యయై యుండినది, అవి ప్రబలముగా అన్యజనుల పట్టణములై యుండినవి (4:25పై గల వ్యాఖ్యానము చూడు) అచ్చట, సముద్రము యొక్క పూర్వదశకు ప్రక్కన, ఒక **పర్వతము** (*oros*) లేక "కొండ" **యెక్కి కూర్చుండెను.** యేసు కొండ యెక్కి కూర్చుండెనను వాస్తవము, ఆయన ఉపదేశించుటకు సిద్దపడి యుండెనని సూచించుచున్నది (5:1, 2పైగల వ్యాఖ్యానము చూడు). నిస్సందేహముగా యేసు అచ్చట "మూడు దినములు" (15:32) ప్రజలకు ఉపదేశించాడు. ఏది ఏమైనా, ఈ క్రింది వచనములలో స్వస్థత గూర్చి నొక్కివక్కాణింపబడినది.

**వచనము 30.** ఈ సందర్భములో, "చెవుడు గల నత్తివానిని" యేసు స్వస్థపర్చాడని మార్కు వ్రాసిన నివేదిక తెలియజెప్పుచున్నది (మార్కు 7:32-37). స్వస్థపరచిన సమయంలో, యేసు వానిని అచ్చట కూడుకొనియుండిన జనసమూహముల నుండి ఒక ప్రక్కకు తీసికొని వెళ్లాడు. వాడు. ఎవరికిని ఎమియు చెప్పవద్దని ఆజ్ఞాపింపబడినప్పటికిని, వాని స్నేహితులు లేదా కుటుంబ సభ్యులు ఆ విషయమును వెంటనే విస్తారముగా ప్రకటించారు. ప్రభువు అచ్చోట ఉన్నాడను వార్త సమీప ప్రదేశముల యందంతటను వేగముగా వ్యాపించి యుండును, గనుకనే **బహు జనసమూహములు** ఆయన యొద్దకు నానా విధములైన రోగములతో బాధపడుచుండిన వారిని ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి. వారిలో కొందరు **కుంటివారు, గ్రుడ్డివారు, మూగవారు, అంగహీనులు ఉండిరి. ఇతరులనేకులు** ఇతర కష్టములతో బాధపడుచుండిరి. వారి స్నేహితులు మరియు కుటుంబ సభ్యులు వారిని **ఆయన యొద్దకే తీసికొనివచ్చి ఆయన పాదముల యొద్ద పడవేసిరి.** వారి వారి అవసరముల చొప్పున, యేసు వారినందరిని కనికరముతో స్వస్థపర్చాడు (4:23-25; 9:35; 11:5; 12:15 చూడు).

**వచనము 31. మూగవారు మాటలాడుటయును, అంగహీనులు బాగపడుటయును, కుంటివారు నడుచుటయును, గ్రుడ్డివారు చూచుటయును**, జనసమూహము చూచి ఆశ్చర్యపడిరి. వారు యేసు క్రీస్తు యొక్క శక్తిని చూచి ఆశ్చర్యచకితులయ్యారు. అదొక

అద్భుతకార్యమని వారు గుర్తించి, **ఇశ్రాయేలు దేవుని మహిమపరచిరి**. "ఇశ్రాయేలు దేవుడు" అను అభివ్యక్తములో ఆ ప్రాంతములోని అన్యజనులు సహితము కలిసియుండవచ్చును. సహాయము పొందినవారు యూదులు మాత్రమే అయియుండినట్లయితే, "వారు దేవుని మహిమపరచిరి" అనియే ఈ గ్రంథ పాఠము వ్రాయబడి యుండేది. నిశ్చయాత్మకమైన ఈ అన్యజనుల ప్రతిస్పందన, యేసు సొంత ప్రజలలో కొందరు, ముఖ్యముగా యూదా మత నాయకులు, ప్రదర్శించిన వ్యతిరేకార్థక ప్రతిస్పందనకు చాలా తారతమ్యముగా నున్నది (11:20–24; 12:14, 24, 38).

## యేసు నాలుగు వేల మందికి ఆహారము పెట్టుట (15:32–39)

**32 అంతట యేసు తన శిష్యులను పిలిచి–ఈ జనులు నేటికి మూడు దినములనుండి నా యొద్ద నున్నారు; వారికి తిన నేమియు లేదు గనుక వారిమీద కనికరపడుచున్నాను; వారు మార్గములో మూర్ఛపోవుదురేమో అని వారిని ఉపవాసముతో పంపివేయుటకు నాకు మనస్సు లేదని వారితో చెప్పగా 33 ఆయన శిష్యులు–ఇంత గొప్ప జన సమూహమును తృప్తిపరచుటకు కావలసిన రొట్టెలు అరణ్యప్రదేశములో మనకు ఎక్కడనుండి వచ్చునని ఆయనతో అనిరి.**
**34 యేసు–మీయొద్ద ఎన్ని రొట్టెలున్నవని వారి నడుగగా వారు–ఏడు రొట్టెలును కొన్ని చిన్న చేపలును ఉన్నవని చెప్పిరి. 35 అప్పుడాయన–నేలమీద కూర్చుండుడని జనసమూహమునకు ఆజ్ఞాపించి 36 ఆ యేడు రొట్టెలను ఆ చేపలను పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వాటిని విరిచి తన శిష్యులకిచ్చెను, శిష్యులు జనసమూహమునకు వడ్డించిరి 37 వారందరు తిని తృప్తిపొందినమీదట మిగిలిన ముక్కలు ఏడు గంపల నిండ ఎత్తిరి. 38 స్త్రీలును పిల్లలును గాక తినినవారు నాలుగువేల మంది పురుషులు. 39 తరువాత ఆయన జనసమూహములను పంపివేసి, దోనెయెక్కి మగదాను ప్రాంతములకు వచ్చెను.**

యేసు నాలుగు వేల మందికి ఆహారము పెట్టిన అద్భుతకార్యమునకును, ఐదు వేల మందికి ఆహారము పెట్టిన విషయమునకును మధ్య పోలికలున్నవి. రెండు సందర్భములలోను, ఆ అరణ్య ప్రదేశములో బహు జనసమూహములు కూడుకొని యుండిరి, కాని వారికి తినుటకు ఆహారమేమియు లేకుండెను. యేసు వారి మీద కనికరపడి, జనసమూహమంతటిని ఒక క్రమ ప్రకారమైన వరుసల్లో కూర్చుండబెట్టాడు. కొన్ని రొట్టెలను మరియు కొన్ని చేపలను తీసికొని, దేవునికి వందనములు చెల్లించి, ప్రజలందరు తిని తృప్తిపడునంత వరకు వారికి పంచిపెట్టబడుచుండెను. ఆ తరువాత, మిగిలిన ముక్కలు ఏడు గంపల నిండా ఎత్తబడెను.

ఇంతకు మునుపు గమనించినట్లుగా, నాలుగు వేల మందికి ఆహారము పెట్టుట అంతకు మునుపటి అద్భుతకార్యము గూర్చి చెప్పుకొనుటకాదు; ఈ రెండు సంఘటనలు అనేక కోణల్లో చాలా భిన్న మైనవై యున్నవి (ఇదివరకటి పుస్తకములోని "ఐదు వేల మందికి ఆహారము పెట్టుట" చూడు). మత్తయి మరియు మార్కు వ్రాసిన విషయములలో రెండు వెవ్వేరు నివేదికలుండుట, ఈ రెండు కూడ ఒకే కథయై యున్నదని అంగీకరించుటకు వ్యతిరేకముగా ఒకరిని గట్టిగా ఒప్పించు వాదనయై యున్నది. ఈ ఇరువురు రచయితలు ఒకే కథను–మరి ముఖ్యంగా పొందికలేని కథను–రెండు పర్యాయములు చెప్పియుండరు.

ఇటువంటి పొరపాటు జరుగకుండా పరిశుద్ధాత్మ యొక్క నడిపింపు వారిని ఆపుజేసినది (2 పేతురు 1:20, 21). యేసు తానే ఈ రెండు అద్భుతముల గూర్చి వివరముగా ప్రస్తావించాడనునది మరొక ఒప్పింపుతో కూడిన వాదనయై యున్నది (16:5–12).

జనసమూహములుగా కూడుకొని యుండినవారు, ఈ రెండు అద్భుతకార్యముల నడుమ గల ప్రాముఖ్యమైన తేడాయై యున్నది. ఐదు వేల మందికి ఆహారము పెట్టబడినప్పుడు, గలిలయ ప్రాంతమునకు చెందిన యూదులు ఒక అరణ్య ప్రదేశమునకు యేసును వెంబడించుచుండిరి (14:13–15). నాలుగు వేల మందికి ఆహారము పెట్టబడిన సందర్భములో, అధిక సంఖ్యాకులు దెకపోలి ప్రాంతమునకు చెందిన అన్యజనులై యుండుట సహజమే (మార్కు 7:31). అన్యజనులకు సంబంధించిన చర్చ మత్తయి సువార్త 15వ అధ్యాయమంతటికి సరిగ్గా సరిపోతోంది: రొట్టెలు తినుట మరియు శిష్టాచార సంబంధమైన పవిత్రత గూర్చి యూదులు చేసిన వాదోపవాదములు (15:1–20) రొట్టెలు మరియు ఒక అన్యురాలి కుమార్తెను స్వస్థపరచుట (15:21–28) ద్వారా యేసు ప్రదర్శించిన అలంకారమునకు మధ్యంతరముగా నిలుచుచున్నవి. యేసు అన్యజనుల సమూహములను స్వస్థపరచుటతోను, అద్భుతరీతిగా వారికి ఆహారము పెట్టుటతోను అది సమాప్తమగుచున్నది (15:29–39).

**వచనము 32. అంతట యేసు తన శిష్యులను పిలచి** ఆయన **ఆ జనసమూహముల మీద కనికరపడుచుండెనని** వారికి చెప్పెను. ఇట్లు చెప్పుట ద్వారా, వారు కూడ కనికరముగలవారై యుండవలెనని (9:36; 14:14; 20:34) ఆయన వారికి బోధించుచు, వారి విశ్వాసమును కూడ పరీక్షించుచుండెను (15:33).

అప్పటికే జనసమూహములు యేసుతో కూడ **మూడు దినములుండిరి** మరియు వారికి **తిన నేమియు లేకుండెను**. మూడు రోజుల కాలము, దీనికి ముందరి పేరాగ్రాఫ్‌లో పేర్కొనబడిన సంఘటనలను, యేసు వారిలో రోగులైయుండిన వారిని స్వస్థపరచిన సంఘటనలను (15:29–31), పూర్వ భావనగా పరిగణలోనికి తీసికొనుచున్నది. ఈ మూడు రోజులు కూడ తెచ్చుకొని యుందురు, కానీ ఈ మూడు రోజుల వ్యవధిలో అది ఖాళీ అయిపోయి యుండును.[7] **వారు మార్గములో మూర్ఛపోవుదురేమో** అని యేసు **వారిని ఉపవాసముతో పంపివేయుటకు ఇష్టపడలేదు.** వారిలో కొందరు చాలా దూర ప్రాంతము నుండివచ్చియుండిరి (మార్కు 8:3) గనుక తిరిగి వారి ఇంటికి చేరుకొనుటకు చాలా దూరము ప్రయాణము చేయవలసి యుండును. యేసు ఈ సందర్భములో జనసమూహముల అవసరతను తీర్చ జూచుచుండెను, అయితే ఆయన శిష్యులు ఐదు వేల మందికి ఆహారము పెట్టబడిన విషయాన్ని లేవదీసారు (14:15).

**వచనము 33. శిష్యులు** యేసు జనసమూహములు కలిగియుండిన ఆందోళనతో ఏకీభవించలేదు, సరికదా ప్రజలంతా తినకుండానే ప్రయాణమై వెళ్లుటకు అనుమతించినట్లయితే కలుగు అపాయము గూర్చి వాదించనూ లేదు. ఏదిఏమైనా, వారు జనుల భారీ సంఖ్య గూర్చి ఆందోళన చెందుచుండిరి: **ఇంత గొప్ప జనసమూహమును తృప్తిపరచుటకు కావలసిన రొట్టెలు అరణ్య ప్రదేశములో** మనకు **ఎక్కడ నుండి వచ్చునని ఆయనతో అనిరి.** వారొక ఏకాంత ప్రదేశములో ఉండినందు వలన, వారు రొట్టెలు కొని తెచ్చుటకు అంగళ్లు అందుబాటులో లేవు. యేసు వారందరికిని ఆహారము పెట్టగల

శక్తిసామర్థ్యములుగలవాడై యున్నాడను సత్యము గూర్చి శిష్యులు ఆలోచించకపోవుట, విడ్డూరముగా నున్నది. ఎంతైనా, యేసు ఐదు వేల మందికి ఆహారము పెట్టిన సంఘటన జరిగి ఎంతో కాలము గడువలేదు (16:8–10 చూడు).

**వచనము 34.** వారి యొద్ద అందుబాటులో ఉండిన ఆహారము గూర్చి యేసు ఆర తీసాడు. అపొస్తలులకు ఏడు చిన్న రొట్టెలు మరియు కొన్ని చిన్న చేపలు మాత్రమే దొరికాయి. ఈ రెండు ఆహారము పెట్టుట'కు సంబంధించిన అద్భుతకార్యములలో, వారి యొద్ద ప్రథమంగా అందుబాటులో ఉండి ఆహారము (రొట్టెలు మరియు చేపల సంఖ్య) మరొక భేదమై వున్నది. ఐదు వేల మందికి ఆహారము పెట్టబడినప్పుడు, శిష్యులు ఐదు రొట్టెలు మరియు రెండు చేపలను ఆయన యొద్దకు తీసికొని వచ్చారు (14:17), అయితే ఈ సందర్భములో వారు ఏడు రొట్టెలు మరియు కొన్ని చిన్న చేపలు తీసికొని వచ్చారు.

**వచనము 35.** యేసు ఐదు వేల మంది విషయములో చేసినట్లే, **నేల మీద కూర్చుండుడని జనసమూహములకు ఆదేశించాడు** "ఆదేశించాడు" అను అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*parangellō*) "ఆజ్ఞాపించాడు" (KJV) లేదా, "ఉత్తరువులు జారీచేయు" అనియు (NRSV) అనువదించవచ్చును; ఈ పదము ఒకరి అధికారమును ఉద్ఘాటించుచున్నది. "కూర్చుండుడి" (*anapiptō*) అనగా, వాలి "కూర్చుండుడి" అని అర్థము, అదొక సామాన్య భోజన భంగిమయై యుండినది. ఐదు వేల మందికి ఆహారము పెట్టిన సందర్భములో, జనసమూహములు "పచ్చిక మీద" కూర్చుండుడని వారికి ఆదేశములియ్యబడినవి (14:19). ఈ సందర్భములో, జనసమూహములు "పచ్చిక మీద" కూర్చుండుడని వారికి ఆదేశములియ్యబడినవి. ఇంతకు ముందటి సంఘటన పస్కా పండుగ (యోహాను 6:4) సమీపించుచుండినదనగా సంభవించినది, గనుక యేసు తూరు మరియు సీదోను ప్రాంతముల గుండా (15:21) పయనించినప్పటికి కొన్ని మాసములు గతించియుండును. ఈ సందర్భములో జనసమూహములు నేల మీద కూర్చుండిరని పేర్కొనబడుట వలన, "అది వేసవి కాలమును, ఎండ వేడిమికి గడ్డి ఎండిపోయి యుండు కాలమును" సూచించుచున్నది.[8]

**వచనము 36.** ఆయన ఇదివరకు చేసినట్లే, యేసు ఆ **రొట్టెలు** మరియు **చేపల** కొరకు మొదట దేవునికి **కృతజ్ఞతా స్తుతులు చెల్లించాడు.** ఈ వచనములోని కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట (*eucharisteō*) అను పదజాలము ఇదివరకటి "ఆశీర్వదించి" (స్తోత్రము చేసి) (*eulogeō*) అను పదజాలమునకు భిన్నమైనదై యున్నది. అట్లయినప్పటికిని, ఈ రెండు పదజాలముల భావము ఆవశ్యకముగా ఒక్కటే (14:19పై గల వ్యాఖ్యానము చూడు). రొట్టెలు మరియు చేపల కొరకు ప్రార్థించిన తరువాత, **ఆయన వాటిని విరిచి తన శిష్యులకిచ్చెను.** శిష్యులు **జనసమూహమునకు** వడ్డించిరి.

**వచనము 37**. మరొక పర్యాయము, యేసు సమృద్ధియైన ఆహారమును సమకూర్చాడు, **వచ్చిన వారందరు తిని తృప్తిపొందిరి**. ఐదు వేల మంది తృప్తిగా భోజనము చేసిన తరువాత, మిగిలిన ముక్కలు పన్నెండు (*kophinos*) గంపలు ఎత్తబడినవి. ఈ సారి **ఏడు పెద్ద గంపల** (*spuris*) నిండా ఎత్తబడినవి (14:20పై గల వ్యాఖ్యానము చూడు). కొన్ని గంపల నిండా మాత్రమే ఎత్తబడినప్పటికిని, మిగిలిన ముక్కలు ఐదు వేల మందికి ఆహారము పెట్టినప్పుడు ఎత్తబడిన మిగిలిన ముక్కలకు సమానముగా లేదా అంత కంటే ఎక్కువే ఉండవచ్చును.

“ఏడు” గంపల నిండా ఎత్తిరి అను వాస్తవము అన్యజనసమూహము యొక్క పరిపూర్ణతను సూచించుచుండవచ్చును.

**వచనము 38.** ఇచ్చట, భోజనము చేసినవారి సంఖ్య కూడ తెలియజెప్పబడుచున్నది: **స్త్రీలును పిల్లలును గాక, తినినవారు నాలుగు వేల మంది పురుషులు** (14:21 చూడు). ఆల్‌ఫ్రెడ్ ఎడర్‌శీమ్ గమనించిన వివరము ఇలా వున్నది, ప్రభువు తన పరిచర్యలోని ప్రతి ఒక్క దశను ఏదో ఒక విధమైన భోజనముతో ముగించాడు. గలిలయ ప్రాంతములో ఆయన చేసిన పరిచర్యను ఐదు వేల మందికి ఆహారము పెట్టుటతో ముగించాడు, అన్యజనులుండిన దెకపొలి ప్రాంతములో నాలుగు వేల మందికి ఆహారము పెట్టుటతో ముగించాడు. యూదయ ప్రాంతములోని పరిచర్య, ఆయన సిలువ మీద మరణించక మునుపు, మేడ గదిలో తన శిష్యులకు భోజనము (పస్కా) పెట్టుటతో ముగిసినది.[9]

**వచనము 39. యేసు జనసమూహములను పంపివేసి,** గలిలయ సముద్ర ప్రాచ్య దిశ నుండి పాశ్చాత్య దిశకు చేరుకొనునట్లు దోనె యెక్కాడు. ఆయన **మగదాను ప్రాంతములకు వచ్చెను.** ఈ సందర్భములో శిష్యులు పేర్కొనబడలేదు, బహుశా, వారు నిస్సందేహముగా ఆయనతో కూడ ఉండియుందురు. మాటవరుసకు మత్తయి యేసు గూర్చి మాత్రమే ప్రస్తావించుచున్నాడు, ఏలయనగా మత్తయి మనస్సంతా యేసు పైనే కేంద్రీకృతమై యుండినది.

ఈ నాడు మగదా ప్రాంతము యొక్క సరైన స్థలమెచ్చట నున్నదో తెలియదు. లేఖనములలో ఈ ప్రదేశము పునఃపేర్కొనబడలేదు, దాని గుర్తింపును బయలుపర్చుటకు ఏ చారిత్రాత్మకమైన సమాచారము సహితము రాబట్టబడలేదు. ఇది “మగదల,” మగ్దలేనే మరియ తన పేరు సంపాదించుకొనిన స్థలము యొక్క పరివర్తనశీల వర్ణక్రమమై యున్నదని వాదోపవాదములు చేయబడుచున్నవి. కొన్ని గ్రీకు చేతి రాత ప్రతులలోని 39వ వచనములో “మగదల” అనియే వ్రాయబడి యున్నది.

మగదానుకు బదులుగా యేసు మరియు తన శిష్యులు దోనె యెక్కి “దల్మనూతా ప్రాంతమునకు వచ్చిరని” మార్కు చెప్పుచున్నాడు (మార్కు 8:10). ఈ స్థలము సహితము సరిగా తెలియకపోగా, అది గెన్నేసరెతు మైదానమునకు సమీపములో గలిలయ సముద్రమునకు పాశ్చాత్య ప్రక్కన ఉండియుండును. యేసు అటుతరువాత మొదట బేత్సయిదాకు వచ్చి, అటుతరువాత ఉత్తర దిశగా ఫిలిప్పుదైన కైసరకు వెళ్లునట్లు మరలా గలిలయ సముద్రమును ఎందుకు దాటవలసి వచ్చినదో, ఈ స్థలము వివరించుచున్నది.

ఈ స్థలమునకు మత్తయి మరియు మార్కు వ్రాసిన సువార్తలలో ఇవ్వబడిన నామధేయములలో గల భేదము, జరిగిన సంఘటనల గూర్చిన ప్రామాణికత్వము విషయమై ఎటువంటి సందేహమునకైనను తావిచ్చుటకు ఆస్కారముండకూడదు. క్రొత్త నిబంధనలోని అనేక స్థలములు–ముఖ్యముగా చాలా చిన్న స్థలములు–ఒక దాని కంటె ఎక్కువ పేర్లు కలిగియున్నవి.[10] మగదాను మరియు దల్మనూతా అను పేర్లు ఒకే ప్రదేశమునకు చెందక భిన్నమైనవై యుండునట్లయితే, ఈ పేర్లు ఒక దానికొకటి సమీపముగా నుండు స్థలములను సూచించును.

## నశించిన ఇశ్రాయేలు గొఱ్ఱెలు (15:24)

యేసు ఇశ్రాయేలు ఇంటివారై నశించిన గొఱ్ఱెల యొద్దకు పంపబడెను (15:24). ఆయన తన శిష్యులను పరిమితమైన అధికారముతో బృహత్కార్యము నిమిత్తమై పంపించినప్పుడు, ఆయన వారిని “ఇశ్రాయేలు వంశములోని నశించిన గొఱ్ఱెల యొద్దకే” పంపించాడు (10:6). అట్లయినను అవకాశము దొరికినప్పుడెల్లా ఆయన అన్యజనులకు పరిచర్య చేయకుండునట్లు ఇది ఆయనను ఆపుజేయలేదు (15:21–28). భౌతిక ఇశ్రాయేలుకు చెందని “వేరే గొఱ్ఱెలు” కలవని ఆయన తన అపొస్తలులకు చెప్పాడు. “అవి నా స్వరము వినును; అప్పుడు మంద ఒక్కటియు గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగునని” ఆయన సెలవిచ్చాడు (యోహాను 10:16). ఈ “వేరే గొఱ్ఱెలు” నానా క్రైస్తవ మత శాఖలకు చెందినవారని కొందరు ఈ రోజుల్లో బోధిస్తున్నారు. ఇది సరి కాదు. ఈ లేఖనము అన్యజనులను సూచించుచున్నది. సమస్త జనులను–యూదులనేమి, అన్యజనులనేమి–“ఒక్క శరీరముగా,” అనగా సంఘముగా విమోచించుట దేవుని ప్రణాళికయై యుండినది (ఎఫెసీయులకు 2:11–16).

## విశ్వాసము (15:28)

మనము విశ్వాసము ద్వారా మాత్రమే రక్షింపబడుదుమని పరిశుద్ధ సత్యవేదము బోధించుచున్నదా? లేదు. వాస్తవమునకు, దానికి వ్యతిరేక సత్యమును అది బోధించుచున్నది (యాకోబు 2:24). మనము “విశ్వాసము ద్వారా కృప చేతనే” రక్షింపబడుదుము (ఎఫెసీయులకు 2:8, 9). మన రక్షణలో కృప అనునది దేవుని పాత్రయై యుండగా, విధేయతతో కూడిన విశ్వాసము మనము ప్రదర్శింపవలసిన మన పాత్రయై యున్నది. విశ్వాసము యొక్క ప్రాముఖ్యతను మనమెన్నడును తక్కువచేయకుందుముగాక. విశ్వాసము మన హృదయములను శుద్ధిచేయును (అపొస్తలుల కార్యములు 15:9), మనము పాపక్షమాపణ పొందుదుము (అపొస్తలుల కార్యములు 10:43), మనలను నీతిమంతులనుగా తీర్చును (రోమీయులకు 5:1), మనలను రక్షించును (1 పేతురు 1:9), మనలను పరిశుద్ధపరచును (అపొస్తలుల కార్యములు 26:16–18). మన విశ్వాసము లోకమును జయించును (1 యోహాను 5:4), మరియు విశ్వాసము ద్వారా మనకు నిత్యజీవము కలదు (1 యెహాను 5:11–13). విశ్వాసము మనలను ఎలా రక్షిస్తుంది? మనము క్రియల ద్వారా రక్షింపబడము, కానీ క్రియలను ప్రదర్శించు విశ్వాసముతో రక్షింపబడుదుము (గలతీయులకు 5:6; హెబ్రీయులకు 11).

దేవుని వాక్యము విశ్వాసమునకు సంబంధించిన తరతమ సాపేక్ష దశలను వర్ణించుచున్నది (15:28) కానీ అల్పవిశ్వాసము కూడ ఉన్నది (14:31). బలమైన విశ్వాసమున్నది (రోమీయులకు 4:20), మరొక ప్రక్క బలహీనమైన విశ్వాసము కూడ ఉన్నది (మార్కు 9:24). మనము విశ్వాసముతో నిండుకొనుట (అపొస్తలుల కార్యములు 11:24), స్థిర విశ్వాసము (కొలొస్సయులకు 2:5), వృద్ధిపొందిన విశ్వాసము (లూకా 17:5), అభివృద్ధిపొందుచున్న విశ్వాసము (2 థెస్సలొనీకయులకు 1:3), మరియు “మృతమైన విశ్వాసము” అని పిలువబడునంతగా నిరర్థకమైన దశకు చేరుకొను విశ్వాసము (యాకోబు

2:26) గూర్చి చదువుదుము. మృతమైన విశ్వాసంమనలను రక్షించదు. రక్షింపబడుటకు సజీవమైయున్న, చైతన్యవంతమైన, కార్యకారియైయున్న విశ్వాసము అత్యావశ్యకమై యున్నది.

---

సూచనలు

[1]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 414. [2]Warren W. Wiersbe, *Be Loyal* (Wheaton, Ill.: Victor Books, SP Publications, 1980), 103. [3]David Hill, *The Gospel of Matthew*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 253; Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 401, n. 48; and W. F. Albright and C. S. Mann, *Matthew*, The Anchor Bible (Garden City N.Y.: Doubleday & Co., 1971), 187 చూడు. [4]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 178. [5]William Barclay, *The Gospel of Matthew,* vol. 2, 2d ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1958), 134-35. [6]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 575. [7]Morris, 409. [8]Robert H Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 154. [9]Alfred Edersheim, *The Life and Times of Jesus the Messiah*, updated ed. (Peabody, Mass.: Hendrickson Publishers, 1993), 517. [10]James Burton Coffman, *Commentary on Matthew* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1977), 235-36.